## గెలుపు కోసం కృషి చేయాలి

పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. మంగళవారం గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ యువనాయకుడు ఆశిష్‌కుమార్ యాదవ్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

- అబిడ్స్

## పోలింగ్ శాతం పెంచడానికి కృషి చేయాలి

ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడానికి అధికారులు, సిబ్బంది కృషి చేయాలని డీసీ, కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి శశి రేఖ అన్నారు. సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీ మాట్లాడుతూ.. మే 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కు ఉన్న వారందరూ వినియోగించుకోవాలని కోరారు. సిబ్బంది ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు.

- మెహిదీపట్నం

# పద్మారావు గెలుపే లక్ష్యంగా..



బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి టి.పద్మారావును పార్టీ రాంనగర్ డివిజన్ మహిళా నాయకులు కలిసి మద్దతు తెలిపారు. రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావులపాటి మోజస్ ఆధ్వర్యంలో కల్పన, సాలమ్మ, రేఖ, మేలి, తిరుమల, అనురాధ, రేణుక, రేహానా, సబానా పద్మారావును కలిశారు.

– ముషీరాబాద్

కాచిగూడ : బూత్‌లెవల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నల్లకుంట సమావేశంలో మాట్లాడుతున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, ఏప్రిల్ 16 : బీఆర్ఎస్ సికింద్రాబాగ్ లోక్‌సభ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్ గెలుపుకోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ నల్లకుంట డివిజన్ కార్యకర్తల సమావేశం డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ ఆధ్వర్యంలో ధ్రువ ఎలైట్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో నల్లకుంట డివిజన్ నుంచి మంచి మెజార్టీ ఇచ్చారని, ఎంపీ ఎన్నికల్లో కూడా అంతకంటే ఎక్కువ తీసుకురావాలని తెలిపారు. పార్టీ అధినేత కేసీఆర్‌కు సికింద్రాబాద్ సీటును గెలిచి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పోటీయే కాదని, ఎంపీగా నిలబడిన దానం నాగేందర్ మొన్న కారు గుర్తుకు ఓటు వేయాలని అడిగారని, ఇప్పుడు కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అడుగుతున్నారని, ఖైరతాబాద్ లోనే మూడోస్థానంలో ఉన్నాడని చెప్పారు.

### కిషన్‌రెడ్డి రామజన్మభూమి పేరుతో ప్రచారం చేస్తున్నాడు..

ప్రస్తుత ఎంపీ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అందంగా మేకప్ వేసుకొని ప్రధాని మోడీ, రామజన్మభూమి పేరుతో ప్రచారం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఎంపీ లాడ్స్‌ను కూడా ఖర్చు పెట్టని ఎంపీ మనకెందుకన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎంపీలు అందరూ పోటీ చేయాలని చెబితే ఎక్కడ ఓడిపోతానో అని పోటీ నుంచి తప్పించుకున్నాడని పేర్కొన్నారు. తన సంపాదనతో చెన్నై, బెంగళూరులో పెట్టుబడులు పెట్టాడన్నారు. అందరికి అందుబాటులో ఉన్న వ్యక్తి మన అభ్యర్థి పద్మారావుగౌడ్ అని తెలిపారు. నల్లకుంట ఒక్క డివిజన్ నుంచే 5 వేల మెజార్జీని తీసుకురావాలని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాక చందర్, వి.రవీందర్‌రావు, జి.ప్రదీప్‌రావు, పి.గెల్వయ్య, గాలపల్లి శంకర్, భాస్కర్‌గౌడ్, విజయేంద్రసాగర్, సాయిని మూర్తి, రాము యాదవ్, నరేందర్, ఇర్ఫానా సుల్తానా, వన్నాడి రమ్య, లావణ్య పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కాచిగూడ, ఏప్రిల్ 16 : పేదల కోసం మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ బూత్‌లెవల్ కాచిగూడ డివిజన్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం మంగళవారం తాజ్‌మహాల్ హోటల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉందని, అంబర్‌పేట ప్రజలు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని చిత్తుచిత్తుగా ఒడిస్తారన్న భయంతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయలేదని పేర్కొన్నారు. 8 ఏండ్లల్లో అంబర్‌పేటకు చేసింది ఏమిలేదని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శాఖలో 75 వేల ఉద్యోగాలు ఉన్నాయని, అయినప్పటికి ఎక్క ఉద్యోగామన్ని ఇవ్వలేదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి, అనునిత్యం కేసీఆర్ వెంట ఉంటూ, పేదల కోసం పాటుపడే బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపునకు సైనికుల్లాగా శ్రమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గెల్వయ్య, సునీల్‌బిల్లాన్, డివిజన్ అధ్యక్షుడు ఎర్ర బీష్మాదేవ్, రవీందర్‌యాదవ్, కె.సదానంద్, ధాత్రిక్ నాగేందర్‌బాబ్జి, బి.కృష్ణాగౌడ్,బబ్లూసింగ్, అంటోని,రాజేశ్, నర్సింహ, పట్నూరి సతీశ్, శ్రీకాంత్‌ముదిరాజ్, బబ్బి,తుమ్మల నర్సింహ్మా రెడ్డి,మహేశ్‌కుమార్, సత్యనారాయణ, పాండురంగ, క్రాంతి పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌ను గెలిపించండి

హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి తనను గెలిపించాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం గోషామహల్ నియోజకవర్గం రహీంపురలో శ్రీనివాస్‌యాదవ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సమావేశంలో శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో తనకు పార్టీ టికెట్‌ను ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల్లో ప్రజలు తనకు మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు.

- అబిడ్స్

## పనిచేసే నాయకులకు గుర్తింపు.

ముషీరాబాద్, ఏప్రిల్ 16 : పార్టీలో కష్టపడి పనిచేస్తున్న నాయకులకు గుర్తింపు ఇస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. కీలకంగా పనిచేసే నాయకులకు పదవుల కేటాయింపు అంశాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్ దృష్టికి తీసువెళ్తాన అన్నారు. మంగళవారం ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి.సోమసుందర్‌ను తన నివాసంలో కలిసి పార్టీకి రాజీనామా చేసిన అంశంపై చర్చించారు. భవిష్యత్‌లో గుర్తింపునిస్తామని హామీ ఇచ్చారు. టి.సోమసుందర్ మాట్లాడుతూ.. తన రాజీనామాను విరమించుకుంటున్నట్లు ప్రకటించి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, శివముదిరాజ్, వై.శ్రీనివాస్, ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## పోటీ ప్రపంచంలో రాణించాలి

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకొని పోటీ ప్రపంచంలో రాణించాలని తెలంగాణ ఉమెన్స్ సెప్టేవింగ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీఐజీ) రేమా రాజేశ్వరి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ అనిబిసెంట్ మహిళా డిగ్రీ కళాశాల 30వ వార్షికోత్సవం మంగళవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రేమా రాజేశ్వరి, గౌరవ అతిథిగా ఓయూ కామర్స్ డిపార్ట్‌మెంట్, యూసీసీ సి.వి. రంజని, కార్టూనిస్ట్ శ్రీధర్, కళాశాల సెక్రటరీ శ్యాంసుందర్‌రెడ్డి విచ్చేసి జ్యోతిప్రజ్వనలం చేసి విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ శ్యాంసుందర్‌రెడ్డి, ప్రెసిడెంట్ దయాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎల్వీ రాజవల్లి, జి.సృజన, రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

- రవీంద్రభారతి

## డాక్టర్‌కు పోలీస్ కమిషనర్ ప్రశంస

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని భరోసా సెంటర్‌లో ఉత్తమ సేవలు అందించిన గోల్కొండ ఏరియా ఆస్పత్రి క్రిటికల్ కేర్ ఫిజిషియన్ డాక్టర్ అమీనా అఫ్సన్ సమ్రీన్‌ను మంగళవారం నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ప్రశంసపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో డీసీపీలు కవిత, శ్వేత పాల్గొన్నారు.

- మెహిదీపట్నం

## సీఎం రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెబుతాం

నారాయణపేటలో జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభలో మాజీ ఎమ్మెల్యే సంపత్.. సీఎం రేవంత్‌రెడ్డిని పొగడడం సిగ్గుచేటని, మాదిగల ద్రోహి సీఎం రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెబుతామని మాదిగ రాజ్యాంగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మన నవీన్ కుమార్ అన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డికి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాటం చెప్పడానికి మాదిగ జాతి సిద్ధంగా ఉందని నవీన్‌రాజ్ స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమంలో మాదిగ రాజ్యాంగ పోరాట సమితి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- రవీంద్రభారతి

జియాగూడ మాజీ కార్పొరేటర్ అయిందాల కృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం అనాథ శరణాలయంలో చిన్నారుల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన కృష్ణ చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు.

- అబిడ్స్

## ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, రమేశ్‌కుమార్,గుజ్జ కృష్ణ,కురుమ సంఘం ప్రతినిధులు

కాచిగూడ,ఏప్రిల్ 16 : కురుమలకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య విచ్చేశారు. కార్యక్రమంలో కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి చెలంపల్లి రమేశ్‌కుమార్, బీసీ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జి.కృష్ణ, విజయ్, శ్రీనివాస్, మల్లేశ్, అమృత, మహేశ్‌కుమార్, పెంటయ్య, రమేశ్, భిక్షపతి, నందగోపాల్ పాల్గొన్నారు.

## ‘ నిరంతర కృషితోనే ఉన్నతంగా రాణిస్తారు’

నిరంతర కృషితోనే ఉన్నతంగా రాణిస్తారని వక్తలు అన్నారు. ఉగాది సందర్భంగా ఉజ్వల స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి నందిపురస్కారాలు ప్రదానం చేశారు. సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మ, జ్యోతిష్య నిపుణులు శివనరసింహన్, సినీ నటి ఉర్వశి, సమాజసేవకులు బాలరాజ్, డాక్టర్ ఎర్రం పూర్ణశాంతి పురస్కారాలు ప్రదానం చేసి సేవలను కొనియాడారు. సాయిపావని నిర్వహణలో గాయకులు ఆలపించిన సినీగీతాలు అలరించాయి.

- తెలుగు యూనివర్సిటీ

## డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

చార్మినార్, ఏప్రిల్ 16 : డిగ్రీ విద్యార్థిని కనిపించకుండా పోయిన ఘటన చార్మినార్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై సౌమ్య తెలిపిన వివరాల ప్రకారం.. మొఘల్‌పుర అగ్నిమాపకశాఖ సమీపంలో నివసించే మహ్మద్ అహ్మద్ హుస్సేన్ కూతురు కిస్వానిధా అహ్మాది నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం అభ్యసిస్తున్నది. సోమవారం కుటుంబ సభ్యులకు సమాచారం అందించకుండా బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు అహ్మాది ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించారు. స్విచ్ఛాఫ్ రావడంతో తన స్నేహితుల ద్వారా ప్రయత్నించారు. సమాచారం లభించక పోవడంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారని ఎస్సై సౌమ్య తెలిపారు. కిస్వానిధా అహ్మాది ఆచూకీ తెలిస్తే 8712660310, 8712571955 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### జువైనల్ హోంలోంచి బాలిక

కాచిగూడ, ఏప్రిల్ 16 : నింబోలిఅడ్డా ప్రభుత్వ బాలికల సదనం (జువైనల్ హోం) నుంచి బాలిక అదృశ్యమైన ఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్సై హెచ్.నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌ఘాట్‌కు చెందిన హనుమంతు కూతురు ప్రియగిరి 2023 జనవరిలో జువైనల్ హోంకు వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం అన్నం తినడానికి హోంలో ఉన్న అందరు బాలికలు రాగా.. ప్రియగిరి కన్పించలేదు. ఆమె వెనుక భాగంలోని కంపౌండ్ వాల్ ఎక్కి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. తిరిగి రాకపోవడం టక్కీజైల్ సూపర్‌వైజర్ సావిత్రి, సిబ్బంది చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టక్కీజైల్ సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# కిషన్ రెడ్డి ఇక్కడి ప్రజల కోసం చేసిందేమీ లేదు

సమావేశంలో మాట్లాడుతున్న దానం నాగేందర్

కవాడిగూడ, ఏప్రిల్ 16 : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇక్కడి ప్రజల కోసం చేసిందేమీ లేదని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని కశిష్ ఫంక్షన్ హాల్‌లో బూత్ కమిటీ కార్యకర్తలు, నాయకుల సమావేశం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్ కుమార్ యాదవ్ అధ్యక్షన జరిగింది. నాగేందర్ మాట్లాడుతూ.. బడ్జెట్ ఉన్నా.. తెలంగాణను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే అవకాశం ఉన్నప్పటికీ కిషన్‌రెడ్డి ఏమీ చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, గౌరీ శంకర్, మాజీ కార్పొరేటర్లు వాజీద్ హుస్సేన్, కల్పనా యాదవ్, తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి, పాశం అనిల్‌కుమార్ యాదవ్, మనోహర్ సింగ్, నల్లబెల్లి అంజిరెడ్డి, ం శంకర్, వెంకట్ గోవింద్, అభిషేక్, చంద్రకళ, భాస్కర్, సురేశ్ కుమార్, నరేందర్ పాల్గొన్నారు.

## బిరుదురాజు రామరాజు 99వ జయంతి

బిరుదురాజు రామరాజు స్మారక పరిశోధక పురస్కారాన్ని విజయలక్ష్మికి ప్రదానం చేసిన వక్తలు

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 16 : జానపద సాహిత్యం వికాసానికి బిరుదురాజు రామరాజు ఎనలేని కృషి చేశారని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి శ్లాఘించారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆధ్వర్యంలో జానపద సాహిత్యోద్ధారకుడు డాక్టర్ బిరుదురాజు రామరాజు 99వ శతజయంతి నిర్వహించారు. భాషా నిలయం ఉపాధ్యక్షులు డాక్టర్ కె. చంద్రప్రకాశ్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో డాక్టర్ బిరుదు రాజు రామరాజు స్మారక పరిశోధక పురస్కారాన్ని విద్యావేత్త డాక్టర్ కంచి విజయలక్ష్మికి ప్రదానం చేశారు.

కార్యక్రమంలో కాళోజీ అవార్డుగ్రహీత డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, సాహితీవేత్తలు డాక్టర్ తిరునగరి దేవకీదేవి, డాక్టర్ ఎ.ఎ.ఎన్. రాజు, డాక్టర్ కె.రత్నశ్రీ, డాక్టర్ వెనిగళ్ల రాంబాబు, భాషా నిలయం గౌరవ కార్యదర్శి టి. ఉడయవర్లు పాల్గొన్నారు.

## స్నేహితుల మధ్య గొడవ.. యువకుడి హత్య

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 16 : మత్తులో తలెత్తిన వివాదం ఓ యువకుడి హత్యకు దారితీసింది. ఈ ఘటన బహదూర్‌పుర పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కిషన్‌బాగ్‌కు చెందిన మహ్మద్ ఖలీల్ (25) డ్రైవర్. సోమవారం రాత్రి స్నేహితులతో కలిసి మద్యం తాగాడు. అనంతరం బస్తీలో ఉన్న నాలా సమీపంలో కూర్చొని.. అదే మత్తులో కుస్తీ పోటీలు పెట్టుకున్నారు. ఈ పోటీ జరుగుతుండగా.. స్నేహితుల్లో ఒక్కరితో ఖలీల్‌కు గొడవ జరిగింది. ఈ గొడవలో అతడి స్నేహితుడిని కొట్టాడు. కొద్ది సేపటి తర్వాత అక్కడికి ఖలీల్ తండ్రి వచ్చాడు. అతడిని చూడగానే అందరూ దూరంగా వెళ్లిపోయారు. ఆ తర్వాత ఖలీల్‌ను తండ్రి ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని ఇంటికి బయలుదేరాడు. అప్పటికే కోపంతో ఉన్న స్నేహితులు వేగంగా వచ్చి, వాహనంపై తండ్రి వెనుక సీట్లో ఖలీల్‌ను బలంగా కిందకు లాగారు. వాహనంపై నుంచి కింద పడిన ఖలీల్‌ను తండ్రి చూస్తుండగానే కత్తులతో పొడిచి హత్య చేశారు.

## రైలు ఢీకొని.. ఇడ్లీ వ్యాపారి మృతి

కాచిగూడ, ఏప్రిల్ 16: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య కథనం ప్రకారం.. లాల్‌దర్వాజకు చెందిన ధనుంజయ(51) ఇడ్లీ వ్యాపారి. ఉప్పుగూడ లలితాబాగ్ బ్రిడ్జి సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని, అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖాన మార్చురీకి తరలించారు.

## నేడే శ్రీరామనవమి శోభాయాత్ర

సుల్తాన్‌బజార్,ఏప్రిల్ 16 : భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శ్రీరామ భవ్య శోభాయాత్రను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం సీతారాంబాగ్ లోని ద్రౌపది గార్డెన్ నుంచి ఘనంగా ప్రారంభిస్తున్నట్లు సమితి అధ్యక్షులు డాక్టర్ భగవంతరావు, ప్రధాన కార్యదర్శి గోవింద్‌రాఠిలు పేర్కొన్నారు.

### కాషాయ మయంగా మారనున్న యాత్ర మార్గాలు

సీతారాం బాగ్ ద్రౌపది గార్డెన్, ఆకాష్‌పురి హనుమాన్ ఆలయాల నుంచి ప్రారంభమైన శోభా యాత్రలు, ధూల్‌పేట్ మాగ్రా నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్రలు మంగళ్‌హాట్ జాలిహనుమాన్ వద్ద కలుసుకుంటాయి. కాగా సీతారాం బాగ్ నుంచి బోయిగూడ కమాన్, మంగళ్‌హాట్ పీఎస్, జాలిహనుమాన్ టెంపుల్, పురానాపూల్, జుమ్మెరా త్ బజార్, బేగంబజార్ ఛత్రి, బర్తన్‌బజార్, సిద్దంబర్ బజార్, గౌలిగూడ, పుత్లిబౌలి,కోఠి ఆంధ్రాబ్యాంకు వరకు చేరుకుంటుంది. నగర పోలీసులు శోభాయాత్రను డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షించనున్నారు. అడుగడుగునా సీసీ కెమెరాలతో నిఘా ఉంచడంతో పాటు కమాండ కంట్రోల్ నుంచి శోభాయాత్రను పోలీస్ ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షిస్తారు. 2 వేల మందితో పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసి శోభాయాత్ర సజావుగా సాగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్ అన్నారు.

## మనస్థాపంతో భర్త ఆత్మహత్య

కాచిగూడ,ఏప్రిల్ 16: భార్యాభర్తల గొడవతో మనస్థాపం చెందిన భర్త రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేటలోని శంకర్‌నగర్‌కు చెందిన ఎన్.సుదర్శన్ (63)ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి. కొన్నిరోజులుగా భార్యాభర్తలు గొడవపడుతున్నారు. ఈ క్రమంలో మనస్థాపం చెందిన సుదర్శన్ మంగళవారం మలక్‌పేట – కాచిగూడ రైల్వేస్టేషన్ మధ్య తిలక్‌నగర్ బ్రిడ్జి సమీపంలో ఎంఎంటీఎస్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## గొలుసు దొంగిలించిన ఆటో డ్రైవర్ అరెస్టు

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 16: ప్రయాణికుడిని వెంబడించి గొలుసు దొంగిలించిన ఆటో డ్రైవర్‌ను అఫ్జల్‌గంజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు మిస్టరీని 36 గంటల వ్యవధిలోనే ఛేదించిన అఫ్జల్‌గంజ్ పోలీసులను డీసీపీ అభినందించారు. డీఐ మధుకుమార్ కథనం ప్రకారం.. అడ్డగుట్ట నివాసి రాకేశ్ ఈ నెల 14న మలక్‌పేట యశోద ఆసుపత్రి ఎదురుగా నాంపల్లి వెళ్లేందుకు ఓ ఆటో ఎక్కాడు. ఆటో డ్రైవర్ నాంపల్లికి తీసుకువెళ్లి.. ఆటోను ఆపకుండా తిప్పడం మొదలుపెట్టాడు. అటూ ఇటూ తిప్పి ఉస్మానియా ఆస్పత్రి వైపు తీసుకొచ్చాడు.

రాకేశ్‌కు అనుమానం వచ్చి, ఉస్మానియా ఆస్పత్రి డెంటల్ కళాశాల వద్ద ఆటో దిగి, అనుమానం రాకుండా నయాపూల్ వైపు నడుచుకుంటూ ముందుకుసాగాడు. ఆటో డ్రైవర్ కూడా అనుమానం రాకుండా రాకేశ్ వెనుకనే వెళ్లి.. అతడి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. దీంతో బాధితుడు వెంటనే అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి ఆటో డ్రైవర్ మహేశ్ (23)ను గుర్తించి అరెస్టు చేశారు. అఫ్జల్‌గంజ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**IN THE COURT OF JUNIOR CIVIL JUDGE CHEVELLA, R.R.DISTRICT AT: CHEVELLA**
**O.S.No. 518 OF 2022**

Between:
T. Surya Prakash ... PLAINTIFF
AND
A. Narsingh Rao ... DEFENDANT
To,
A. Narsingh Rao, S/o. Late. A. Bandoji, aged about 41 years, Occ:Business R/o H.No.14-2-57, Gosha Mahal Chandan Wadi, Begum Bazar, Hyderabad-500012, Telangana State.
Sir,
Please take Summons that the above-named Plaintiff has instituted a civil suit against you for Specific Performance of Agreement of Sale dated 11-1-2019 in respect of land bearing Sy.No.1838 adm. Ac.0-07 guntas situated at Shabad village & Mandal, R.R.District, Ranga Reddy District. The above case is posted on 22-4-2024 for your appearance.
Therefore make it convenient to present yourself either in person or through authorized agent before the above mentioned Court at 10.30 A.M. on 22-4-2024. Otherwise the matter will be decided in exparte.
(BY ORDER OF THE COURT)
**K. Sanjeeva Reddy,** Advocate.
H.No.7-2-320/P, Padma Sri Hills, Bandlaguda Jagir village, Bandlaguda Jagir Muncipal Corporation, R.R.Dist. Ph: 98495 23948
COUNSEL FOR PLAINTIFF